

వైసీపీకి మూకుమ్మడి రాజీనామాలు
» శృంగరాయనిపాలెంలో సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ సహా 100మంది రాజీనామా -6లో..
పలుచోట్ల పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

కిక్కే.. కిక్కు!!



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మందుబాబులు రెచ్చిపోయారు. సంక్రాంతి పండగ పేరుతో మూడురోజులు విరామం లేకుండా తెగ తాగేశారు. వేలాది మంది సీసాలు, బీరు బాటిళ్లు ఉఫ్ మని ఊదేశారు. ఎత్తిన బాటిళ్లు దించకుండా సీసాలకు సీసాలు ఖాళీ చేసేశారు. ఒకరకంగా చెప్పాలంటే సంక్రాంతి పండగ మూడురోజులు మందుబాబులు అడ్డూఅదుపు లేకుండా తాగడమే పనిగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో మద్యం విక్రయాలు రికార్డు సృష్టించాయి. భోగి, సంక్రాంతి, కనుమ ఈ మూడు రోజులు జిల్లావ్యాప్తంగా మద్యం విక్రయాలు ఏకంగా రూ.22.42కోట్లకు చేరాయి. దీంతో ఎక్సైజ్‌శాఖకు కాసుల పంట పండింది. తెచ్చిన స్టాకు మూడురోజుల్లోనే ఖాళీ అయిపోవడంతో కోట్లతో ఖజానా నిండిపోయింది. అసలే ఎన్నికల ఏడాది కావడంతో ఈ సంక్రాంతికి మందు విక్రయాలు భారీగా ఉంటాయని ఎక్సైజ్‌శాఖ ముందుగానే సిద్ధమై గోదాములను సరుకుతో నింపేసింది. జిల్లాలో ఎక్కడికక్కడ మద్యం దుకాణాలకు స్టాకు భారీగా పంపింది. అనుకున్నట్లుగానే కనుమ మరుసటి రోజుకు మద్యం దుకాణాల్లో సరుకు అంతా ఖాళీ అయిపోయింది. గతేడాది సంక్రాంతికి జిల్లావ్యాప్తంగా రూ.20కోట్ల సరుకు అమ్ముడవగా, ఈఏడాది మరో రూ.2.42కోట్ల వరకు అదనంగా అమ్మకాలు జరిగాయి.

ఊదేశారంతే...

సంక్రాంతి అంటే కోడిపందేలు. కోడి పందేలు అంటే సంక్రాంతి. వివిధ వృత్తులు, ఉపాధి రీత్యా దేశ నలమూలలా ఎవరు ఎక్కడెక్కడ ఉన్నా పెద్దపండగకు సొంతూర్లకు వచ్చి వాలాల్సిందే. మూడురోజుల పాటు సరదా.. సరదాగా గడిపేయాల్సిందే. ఈ క్రమంలో సంక్రాంతి పండగ పేరుతో స్నేహితులు కలిస్తే ఊరుకుంటారా.. ఏకంగా మందు సీసాలు పదుల సంఖ్యలో ఖాళీ అవ్వాల్సిందే. ఇదేకాదు జిల్లాలో సంక్రాంతికి కోడిపందాలు ఎక్కడికక్కడ గ్రామాలు, పట్టణాలు, కాకినాడ నగరం ఇలా ప్రతిచోటా నిర్వహించారు. అదే చోట కోట్లలో గుండాటలు కూడా నిర్వహించారు. దీంతో ఒకపక్క కోడిపందాలు, గుండాట ఎంజాయ్ చేస్తూ మరోపక్క మద్యం సీసాలను మందుబాబులు తెగ తాగేశారు. భోగి, సంక్రాంతి, కనుమ పండగల పేరుతో మూడురోజులపాటు బాటి ళ్లకు బాటిళ్లు ఎత్తేశారు. వాస్తవానికి ఈ సంక్రాంతి ఎన్నికల ఏడాది కావడంతో జిల్లావ్యాప్తంగా కోడి పందేలకు ఆటంకాలు లేకుండా ఎక్కడికక్కడ అధికారపార్టీ నేతలు చూసుకున్నారు. ఫలితంగా ప్రతి చోటా పందాలు భారీగా జరిగాయి. అదే సమయంలో మందు విక్రయాలు సైతం బరుల సమీపంలో దర్జాగా జరిగాయి. ఫలితంగా ఈ దఫా సంక్రాంతికి పండగకు జిల్లాలో మద్యం అమ్మకాలు మూడు రోజులకు కలిపి ఏకంగా రూ.22.42కోట్లకు ఎగబాకాయి. ఒకరకంగా చెప్పాలంటే జిల్లాల విభజన తర్వాత సంక్రాంతి పండగకు ఈస్థాయిలో అమ్మకాలు జరగడం ఇదే తొలిసారి. గతేడాది జిల్లాలో సంక్రాంతికి రూ.20కోట్ల వరకు మద్యం అమ్ముడై కొత్త రికార్డు సృష్టించింది. కానీ ఈ ఏడాది అమ్మకాలు అంతకుమించి జరగడంతో గతేడాది రికార్డు బద్దలైంది. జిల్లాలో ఒక్క భోగి రోజు విక్రయాలే రూ.7.78కోట్లు నమోదయ్యాయి. సంక్రాంతి రోజు రూ.7.51కోట్లు, కనుమ రోజు రూ.7.13కోట్లు చొప్పున మద్యం అమ్ముడైంది. మొత్తం మద్యం విక్రయాలు జిల్లాలో మూడురోజులకు కలిపి రూ.22.42 కోట్లుగా నమోదైంది. ఇందులో బ్రాందీ, విస్కీ, రమ్ము తదితర ఐఎంఎల్ మద్యం కేసులు 22,562 అమ్ముడవగా, బీరుసీసాలు 2.65లక్షలు విక్రయాలుజరిగాయి. వాస్తవానికి జిల్లాలో సాధారణ రోజుల్లో రోజుకు జిల్లావ్యాప్తంగా ఉన్న 157 మద్యం దుకాణాల్లో రూ.3కోట్లవరకు మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. కానీ సం క్రాంతి పండగ నేపథ్యంలో రోజువారీ అమ్మకాలు రూ.7కోట్లు దాటిపోయాయి. అంటే డబుల్ విక్రయాలు జరిగాయన్న మాట. ఈ సంక్రాంతి ఎన్నికల ఏడాది కావడంతో మందు విక్రయాలు భారీగా ఉంటాయని అధికారులు ముందుగానే అంచనా వేసి అన్ని మద్యం దుకాణాలకు డబుల్ ఇండెంట్ పంపారు. అనుకున్నట్లుగానే సరుకంతా మందుబాబులు ఊదేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఖజానాకు కోట్ల కళ పెరిగింది. గతనెల డిసెంబరు 31న జిల్లాలో రూ.7.50కోట్ల వరకు న్యూ ఇయర్ పేరుతో మద్యం విక్రయాలు జరిగాయి. అంతకుముందు ఏడాదితో పోల్చితే ఈ విక్రయాలు ఎక్కువే. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు మద్యం ఆదాయం భారీగా వచ్చి పడింది. ఈనెలలో సంక్రాంతి అమ్మకాలు అధికంగా ఉన్న నేపథ్యంలో జనవరి మద్యం అమ్మకాలు రూ.100 కోట్ల వరకు దాటవచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో గతేడాది ఏప్రిల్ 1 నుంచి డిసెంబరు 31వరకు జిల్లావ్యాప్తంగా రూ.855కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. జనవరి విక్రయాలు తోడైతే ఏకంగా రూ.వెయ్యి కోట్ల అమ్మకాలు దాటవచ్చని అధికారులు భావిస్తున్నారు.

- » జిల్లాలో సంక్రాంతి పండగకు సీసాలకు సీసాలు ఊదేసిన మందుబాబులు
- » భోగి, సంక్రాంతి, కనుమ ఈ మూడు రోజుల్లో రూ.22.42కోట్ల మద్యం అమ్మకాలు
- » ఒక్కో రోజు రూ.7కోట్లకుపైగానే సరుకు ఖాళీ: మామూలు రోజులకంటే డబుల్
- » పండగ మూడు రోజులకు కలిపి ఏకంగా 2.65 లక్షల బీరు సీసాలు లేపేసిన వైనం
- » గతేడాది సంక్రాంతికి జిల్లావ్యాప్తంగా రూ.20కోట్ల మద్యం అమ్మకాలు
- » అప్పటితో పోల్చితే ఈసారి రూ.2.42కోట్లకుపైగా అదనపు విక్రయాలు
- » మొన్న డిసెంబర్ 31న జిల్లా అంతా కలిపి రూ.7.50కోట్లకుపైగా మందు అమ్మకం
- » ఈనెలలో మొత్తం మద్యం విక్రయాలు రూ.100కోట్లు దాటొచ్చని అంచనా

37వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

-6లో..



తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె 37వ రోజుకు చేరుకుంది. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ సమ్మె కొనసాగుతుండగా.. పెద్దాపురంలో షోకాజ్ నోటీసులకు సమాధానాల లేఖలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆకట్టుకున్న 'సత్యహరిశ్చంద్ర'

-6లో..



ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో గౌరీశంకర్ల 87వ వార్షికోత్సవంలో భాగంగా ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకం ఆకట్టుకోగా అందులోని ఓ దృశ్యం

నేడు జేఎన్టీయూకేలో వర్క్‌షాప్

జేఎన్టీయూకే, జనవరి 17: వర్సిటీ ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) డైరెక్టరేట్ ఆధ్వర్యంలో సెనేట్‌హాల్లో ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఇనీషియేటివ్స్, ఇన్నోవేషన్ ఎంటర్ ప్రెన్యూరియల్ స్కిల్స్ అనే అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఓడీఎల్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు ముఖ్యఅతిథిగాను, రిసోర్స్‌పర్సన్‌గా బెంగళూరులోని జేవీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ నుంచి ఎన్ఎంకే భట్టా, ముంబైలోని నార్సీమోంజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌నుంచి బి.పాండురంగారావు, అతిథులుగా రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత పాల్గొంటున్నారన్నారు. ఉన్నత విద్యా కార్యక్రమాల్లో భాగంగా అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి, ఉపాధిని పెంపొందించడానికి చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు తెలియజేస్తామని, దీనికి విశ్వవిద్యాలయ కళాశాలలు, అనుబంధ కళాశాలలనుంచి అధ్యాపకులు, విద్యార్థులు హాజరుకావాలని సూచించారు.

తిరుగు ప్రయాణంలో తప్పని ఇక్కట్లు

- » సంక్రాంతి సెలవులు పూర్తితో దూరప్రాంతాలకు బయలుదేరిన జిల్లావాసులు
- » రద్దీగా రైళ్లు, బస్సులు.. ప్రయాణికులకు పాట్లు

సామర్లకోట, జనవరి 17: సంక్రాంతి పండుగ సెలవులు పూర్తి కావడంతో జిల్లావాసులు తిరుగు ప్రయాణాలు చేపడుతున్నారు. ముక్కనుమ పండుగ పూర్తి చేసుకుని కొందరు ప్రయాణికులు బుధవారం తమ గమ్యస్థానాలకు బయలుదేరారు. సామర్లకోట రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌లు ప్రయాణికులు, లగేజీలతో కిటకిటలాడాయి. పండుగ రద్దీని నియంత్రించేందుకు ప్రయాణికుల రవాణా అవసరాలు తీర్చేందుకు అటు రైల్వే, ఇటు ఆర్టీసీ సంస్థలు ప్రత్యేక సంక్రాంతి సర్వీసులు అందుబాటులోకి తెచ్చాయి. కానీ ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా అవి లేవు. దీంతో చాలామంది ప్రయాణాలకు ఇబ్బంది పడుతున్నారు. రైళ్లల్లో సాధారణ బోగీల సంఖ్య ఈఏడాది 50శాతం తగ్గించడంతో రైల్వే స్టేషన్లలో రైలు ఎక్కేందుకు ప్రయాణికులు రద్దీ దృష్ట్యా ఎక్కలేకపోయారు. దీంతో తాము ఎక్కాల్సిన రైలు తమ ఎదురుగానే వెళ్లిపోవడంతో తీవ్ర నిరాశ చెందారు. ప్రైవేట్ ట్రావెల్స్ సైతం మూడు నుంచి నాలుగు రెట్లు అదనపు చార్జీలను వసూలు చేయడంతో ప్రయాణికులు నిలువునా దోపిడీకి గురయ్యారు. అధిక చార్జీలను నియంత్రిస్తామని వారం ముందుగానే రవాణాశాఖ అధికారులు హెచ్చరిక ప్రకటనలు చేసినా మంగళ వారంనుంచి పత్తాలేకుండా పోయారన్న ఆరోపణలు వినవచ్చాయి.



సామర్లకోట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల పాట్లు

ఉరుస్ షరీఫ్ గంధోత్సవానికి సర్వం సిద్ధం

- » ఈనెల 20 నుంచి 22 వరకూ రెండు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు
- » వేలాదిగా తరలిరానున్న భక్తజనం.. ఏర్పాట్లు పూర్తి చేసిన దర్గా కమిటీ

పెద్దాపురం, జనవరి 17: పెద్దాపురం పట్టణ శివారులో ఉన్న హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా, హజరత్‌షా రహమతుల్లా వార్ల ఉరుస్ షరీఫ్ గంధోత్సవం ఈనెల 20వతేదీ నుంచి 22వతేదీ వరకూ ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మమద్ లాయక్ ఆలీ తెలిపారు. 350ఏళ్ల ఘనచరిత్ర కలిగిన ఈ గంధోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలలనుంచి కులమతాలకు అతీతంగా పెద్దసంఖ్యలో వేలాదిగా తరలివచ్చే అశేష భక్తజనానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ గంధోత్సవంలో భాగంగా ఈనెల 20న ముస్లిం అంజుమన్ వ్యవస్థాపకుడు దివంగత ఎంఏ సత్తార్ గృహం నుంచి గంధం ఊరేగింపు మేళతాళాలతో బయలుదేరి దర్గాకు చేరుకుంటుందని, హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన ప్రత్యేక పచ్చటి వస్త్రాన్ని బాబా వారికి అలంకరించి ఖురాన్ పఠనం, గంధాన్ని సమాధికి పూస్తారని తెలిపారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ గంధోత్సవంలో కులమతాలకు అతీతంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులు పాల్గొంటారని, దర్గా వద్ద ఖురాన్ ఖానీ, ఫాతేహాఖానీ, వాజ్, ఖవ్వాళీ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. ముఖ్యఅతిథులుగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, జనసేన పెద్దాపురం ఇన్‌చార్జ్ తుమ్మల బాబుతోపాటు పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై ఈ గంధోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.



గంధోత్సవానికి ముస్తాబైన దర్గా

ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించాలంటూ..

పట్టు రైతుల ధర్నా

- » రూ.2కోట్ల మేర బకాయిలకు గాను రూ.40లక్షలు మాత్రమే చెల్లింపు

గొల్లప్రోలు రూరల్, జనవరి 17: ఇన్సెంటివ్ బకాయిలు విడుదల చేయాలంటూ గొల్లప్రోలు మండలం చేబ్రోలు సెరీకల్చర్ ఫారమ్‌వద్ద రైతులు, రీలర్లు బుధవారం ధర్నా నిర్వహించారు. పట్టుగూళ్లు విక్రయించిన రైతులకు కిలోకు రూ.50 వంతున రాష్ట్ర ప్రభుత్వం ఇన్సెంటివ్ చెల్లించాల్సి ఉంటుంది. మూడున్నర సంవత్సరాలుగా పట్టురైతులకు ఈ ఇన్సెంటివ్‌ను చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. ఆరునెలల క్రితం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పట్టురైతులతో సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంలో రెండురోజుల్లో చెల్లింపులు చేస్తామని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చారు. అది నెరవేరలేదు. దీంతో పట్టురైతులు ఆందోళనబాట పట్టారు. రెండు వారాల క్రితం కాకినాడ వచ్చిన సీఎం జగన్ దృష్టికి బకాయిల విషయాన్ని తీసుకువెళ్లారు. తదనంతరం రూ.2కోట్లకు పైగా ఉన్న రైతుల బకాయిల్లో రూ.40లక్షలు మాత్రమే చెల్లించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిల సంగతి తేల్చలేదు. దీంతో చిన్న రీలర్లకు చెల్లించే ఇన్సెంటివ్‌లు, హనుమాన్ జంక్షన్, కదిరి, మదనపల్లి, హిందూపురం తదితర ప్రాంతాల్లో విక్రయించిన పట్టుగూళ్లకు సంబంధించి ఇన్సెంటివ్‌లు అన్ని కలిపి రూ.8కోట్ల వరకూ ప్రభుత్వంనుంచి రావాల్సి ఉంది. ఈ బకాయిలను తక్షణం చెల్లించాలంటూ పట్టురైతులు, రీలర్లు కలిపి చేబ్రోలు పట్టుపరిశ్రమల కేంద్రంవద్ద ధర్నా నిర్వహించారు. బకాయిలు అన్నింటినీ చెల్లిస్తామని పట్టుపరిశ్రమశాఖ కమిషనర్ సహా ప్రజాప్రతినిధులు పలుమార్లు హామీలు ఇచ్చినా నేటికీ నెరవేరలేదని వారు మండిపడ్డారు. తక్షణం బకాయిలు చెల్లించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా రైతుల ఆందోళన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని పట్టుపరిశ్రమలశాఖ డీడీ రామరాజు తెలిపారు.



గొల్లప్రోలు మండలం చేబ్రోలు సెరీకల్చర్ ఫారమ్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు, రీలర్లు

జేఎన్టీయూకేలో ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేయాలి

- » స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్, రిసెప్షన్ సెంటర్లను పరిశీలించిన కలెక్టర్

జేఎన్టీయూకే, జనవరి 17: ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి జేఎన్టీయూకేలో ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్, రిసెప్షన్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ కృతికాశుక్లా బుధవారం పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జేఎన్టీయూకే, రెవెన్యూ, ఎన్నికల అధికారులతో కలిసి బుధవారం స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ పరిశీలించారు. జేఎన్టీయూకేలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ, మెకానికల్ బ్లాక్, సివిల్ ఇం.నీరింగ్ పీజీ బ్లాక్, ఇన్నోవేషన్ రీసెర్చ్ సెంటర్, ఇండోర్ స్టేడియం, ఇతర ఇంజనీరింగ్ బ్లాక్‌లను పరిశీలించి ఆయా బ్లాక్‌ల్లో ఉన్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాకు సంబంధించిన ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్, రిసెప్షన్ సెంటర్లను కాకినాడ జేఎన్టీయూకేలో ఏర్పాటు చేయనున్నామన్నారు. నిర్దేశించిన గడువు లోపు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట రిజిస్ట్రార్ సుమలత, యూసీఈకే ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాగనరసింహారావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు కిషోర్, సీతారామారావు, ప్రత్తిపాడు ఈఆర్వో, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, తుని ఈఆర్వో ఏవీఎస్ఎన్ మూర్తి, జగ్గంపేట ఈఆర్వో సూర్యనారాయణ, కాకినాడ అర్బన్ తహసీల్దార్ సీతాపతిరావు, కలెక్టరేట్ ఎన్నికల డీటీ జగన్నాథం, మున్సిపల్ అధికారులున్నారు.



జేఎన్‌టీయూకేలోని ఇండోర్ మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా, ఇతర అధికారులు

సంక్రాంతి సెలవులు మరో మూడురోజులు పొడిగింపు

కాకినాడ రూరల్, జనవరి 17: ఏపీలో సంక్రాంతి సెలవులను మరో మూడురోజులు పొడిగిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేసినట్లు కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జ్ డీఈవో, ఆర్జేడీ జి.నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు విద్యాశాఖ ప్రకటించిందని ఆమె తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, ప్రైవేట్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్‌కు చెందిన అన్ని యాజమాన్యాలకు సంబంధించిన 1 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయన్నారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించి ప్రైవేట్ విద్యాసంస్థలు 10వ తరగతి విద్యార్థులకు ఈ సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే ఆయా పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ తెలిపారు.

తూరంగిలో చోరీ

- » రూ.2.3లక్షల విలువైన నగల అపహరణ

కాకినాడ రూరల్, జనవరి 17: కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని తూరంగేశ్వరనగర్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. రూ.2లక్షల30వేల విలువైన 105 గ్రాముల బంగారం, 200 గ్రాముల వెండి అపహరణకు గురైనట్లు ఇంద్రపాలెం ఎస్ఐ మణికుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలివి. తూరంగికి చెందిన దాడిశెట్టి అప్పలస్వామి సర్పవరంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. పండగ సెలవుల నిమిత్తం ఈనెల 13న తమ ఇంటికి తాళాలు వేసుకుని పశ్చిమగోదావరి జిల్లా చేబ్రోలులోని అత్తవారింటికి కుటుంబమంతా వెళ్లారు. బుధవారం వారి ఇంటి తాళాలు పగులగొట్టి తలుపులు తెరచి ఉండడంతో స్థానికులు ఈ సమాచారాన్ని వారికి తెలపగా వెంటనే వారు ఇంటికి వచ్చారు. దీంతో దొంగతనం జరిగినట్లు నిర్ధారించి ఇంద్రపాలెం పోలీసులకు సమాచారమివ్వగా పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. అప్పలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మణికుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని పారిశుధ్య కార్మికుడి మృతి -5లో
రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి -5లో
ధర్మవరం హైవేపై ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధం -5లో

ప్రాణం తీసిన సెల్ఫీ
» పిఠాపురం మండలం చిత్రాడ మంచినీటి చెరువులో పడి వలంటీర్ మృతి
» సెల్ఫీ తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తూ జారిపడ్డ ఇద్దరు యువకులు
» మరొకరు సురక్షితం -5లో

కోట్లు నష్టపోయాం... ఐదేళ్లు ఇబ్బందులు పడ్డాం

- అమలాపురంలో వైసీపీకి పలువురు రాజీనామా
- స్థానిక నాయకత్వం తీరుపై అసహనం


వైసీపీకి రాజీనామా చేసిన లేఖను చూపిస్తున్న వాసంశెట్టి సత్యం, కుటుంబ సభ్యులు

అమలాపురంటౌన్, జనవరి 17: 'వైసీపీలో చేరి కోట్లు నష్టపోయాం... పార్టీ కోసం ఎంతో కష్టపడ్డాం. కేసుల్లో ఇరుక్కున్నాం. మళ్లీ అదే నాయకుడిని ఎమ్మెల్యే అభ్యర్థిగా తీసుకురావడానికి యత్నిస్తున్నారు' అంటూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అమలాపురం పట్టణానికి చెందిన యువ నాయకుడు వాసంశెట్టి సుభాష్ సహా పలువురు వైసీపీకి రాజీనామా చేశారు. అమలాపురంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సుభాష్, అతని తండ్రి, మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా సొంత ధనాన్ని వెచ్చించి వైసీపీ అభ్యర్థుల విజయంకోసం రేయింబవళ్లు కష్టపడ్డామన్నారు. ఏడాదిన్నర కాలంగా స్థానిక నాయకత్వం కారణంగా ఎన్నో ఇబ్బందులకు గురయ్యామన్నారు. పార్టీ కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే తమతో పాటు ఎందరినో అల్లర్ల కేసులో అక్రమంగా ఇరికించారన్నారు. సమస్యను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తే పరిష్కరిస్తామన్నారు. ఇబ్బంది పెట్టే నాయకులకు టిక్కెట్టు ఇవ్వవద్దని ఆ రోజే స్పష్టంగా చెప్పామని, అయినప్పటికీ ఆ అభ్యర్థికే టిక్కెట్టు కేటాయిస్తారని ప్రకటనలు వస్తున్న నేపథ్యంలో రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. స్థానిక నాయకత్వంవల్ల ఎన్నో ఇబ్బందులుపడ్డాం. అమలాపురం అల్లర్ల కేసుల్లో 325 మంది బాధితులు అనుకుంటున్నారు. వేలాది మంది ఊరు విడిచి వెళ్లిపోయారని గుర్తు చేశారు. అల్లర్ల కేసులో అన్ని సామాజికవర్గాల వారిని ఇరికించారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు దళిత సామాజిక వర్గానికి చెందిన గెద్దాడ వెంకటేశ్వరావు ఏడాదిన్నరగా బెయిల్ పొందలేక ఇంకా జైలులోనే ఉన్నాడని వివరించారు. తన తల్లి, మున్సిపల్ కౌన్సిలర్ వాసంశెట్టి కృష్ణకుమారికి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఇస్తానని నమ్మించి ఆర్థికంగా ఎంతో ఖర్చు చేయించారని సుభాష్ చెప్పాడు. చివరి నిమిషంలో చైర్‌పర్సన్ పదవి ఇవ్వకపోగా అధిష్ఠానం తమకు మంచి పదవి ఇస్తానంటే మంత్రి పినిపే విశ్వరూప్‌తో పాటు వైసీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ సతీష్‌కుమార్ అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే పార్టీని వీడుతున్నట్టు ప్రకటించి రాజీనామా లేఖను చూపించారు. ఏ పార్టీలో చేరేదీ త్వరలో ప్రకటిస్తామన్నారు. తాము కూడా రాజీనామా చేస్తున్నట్టు కామనగరువు ఎంపీటీసీ గుత్తుల భవాని, ఈదరపల్లి ఎంపీటీసీ అడపా సత్తిబాబు, మొగళ్ళమూరి సర్పంచ్ రాయుడు విష్ణు, దొంగ శ్రీను ప్రకటించారు.

బంగారం దొంగ అరెస్టు

పది రోజుల్లో చోరీ కేసు చేధించిన మండపేట పోలీసులు


విలేకరులతో మాట్లాడుతున్న రామచంద్రపురం డీఎస్పీ ప్రసాద్

మండపేట, జనవరి 17: 304 గ్రాముల బంగాం చోరీ కేసును మండపేట పోలీసులు పదిరోజుల్లో చేధించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడికి చెందిన గాధంశెట్టి రామచంద్రమూర్తికి చెందిన బంగారం దుకాణంలో ఈనెల 6న చోరీ జరిగింది. కేసు వివరాలను రామచంద్రపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ మండపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో బుధవారం వెల్లడించారు. ఈఘటనలో 304 గ్రాముల బంగారం వస్తువులు ఒక వ్యక్తి అపహరించాడు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డిజిల్లా షామీర్‌పేట మండలం మాలకపేటలో ఆనందనగర్‌కాలనీకి చెందిన 25ఏళ్ల గొట్టపు లోకేశ్ తాపి పనిచేస్తుంటాడు. ప్రస్తుతం అతడు పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం రాయిపురం గ్రామంలో ఉంటున్నాడు. అతడు ద్వారపూడిలో తాపీ మేస్త్రిగా కొంత కాలం నుంచి పనిచేస్తున్నాడు. ఈనెల ఆరో తేదీ రాత్రి ద్వారపూడికి చెందిన గాధంశెట్టి రామచంద్రమూర్తికి చెందిన బంగారం దుకాణం గోడకు కన్నం పెట్టి రూ.9లక్షల విలువైన బంగారు వస్తువులను లోకేశ్ అపహరించాడు. దుకాణం యజమాని ఫిర్యాదుతో మండపేట రూరల్ ఎస్‌ఐ బి.ఎస్.కృష్ణ కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలంలో లభ్యమైన ఆధారాలతో రూరల్ సీఐ కొమ్ముల శ్రీధర్‌కుమార్ విచారణ చేపట్టారు. ఈనెల 16న ద్వారపూడి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో ఉన్న పాతమద్యం దుకాణం వద్ద నిందితుడు లోకేశ్‌ను పోలీసులు పట్టుకుని విచారించారు. నేరాన్ని అతడు అంగీకరించాడు. మొత్తం బంగారాన్ని రైల్లో తీసుకువెళ్తే పోలీసులు పట్టుకుంటా రని, ద్వారపూడి ఓవర్ బ్రిడ్జి పిల్లర్ వద్ద కొంత బంగారాన్ని పాతి పెట్టినట్టు చెప్పాడు. కొంత బంగారాన్ని విశాఖపట్నంలో విక్రయించినట్టు అతడు చెప్పాడు. పాతిపెట్టిన రూ.7.20లక్షల విలువైన 240 గ్రాముల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. పది రోజుల్లో కేసును చేధించిన మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్, మండపేటరూరల్ పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినంది ంచారు. నిందితుడిని రాజమహేంద్రవరం కోర్టులో బుధవారం హాజరుపర్చినట్టు డీఎస్పీ తెలిపారు.

రూ.25 కోట్లు గుటుక్కు

- 4 రోజుల్లో.. ఇరగ తాగేశారు
- పండక్కి పూటుగా మద్యం
- 25వేల కేసుల మందు..
- 1.20 లక్షల బీర్లు అమ్మకం
- పందెం బరుల్లో ఏరులై పారిన మద్యం



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పండుగ నాలుగు రోజులూ కిక్ గట్టిగానే ఎక్కింది. కోడి పందెం బరులు పెద్ద సంఖ్యలో ఏర్పాటుచేయడం.. అక్కడ మందు ఏరులై పారడంతో మందుబాబులు తెగ తాగేశారు. మొహమాటాన్ని అడ్డుపెట్టి చుట్టాల గొంతుల్లోనూ పోసేశారు. బెల్టు షాపుల్లో కూడా నిరంతరం మందు అందుబాటులో ఉండడంతో అడ్డూఅదుపూ లేకుండాపోయింది. దీంతో జిల్లాలో మద్యం అమ్మకాల కిక్కు ప్రభుత్వ ఖజానాను ఉర్రూతలూగించింది. సంక్రాంతి నాలుగు రోజుల మందు అమ్మకాలపై ఉన్నతాధికారులు ముందుగానే దృష్టి సారించారు. దీంతో మద్యం ద్వారా రెండు వారాల్లో సమకూరే సొమ్ము నాలుగు రోజుల్లోనే ప్రభుత్వ గల్లాపెట్టెలోకి వచ్చేసింది. పండుగలు, పర్వదినాల్లో మద్యానికి లోటు రాకుండా చూస్తున్న ప్రభుత్వ లక్ష్యం బాగానే నెరవేరుతోంది. మరోవైపు మద్యం ధరలను ఇష్టానుసారం పెంచేస్తూ జనాల జేబులకు పాలకులు పెద్ద చిల్లులే పెడుతున్నారు. ఈ విపరీతమైన ధరలవల్ల మద్యం ప్రియులు కోట్లాది రూపాయలు నష్టపోతున్నారు. పండుగ ముందు రోజు తాజాగా 8పీఎం, మ్యాజిక్ మూమెంట్‌పై ప్రభుత్వం ధర పెంచింది. అంతకు ముందు కొన్ని బ్రాండ్లపై బాదేసింది. డిమాండ్ ఉన్న బ్రాండ్లకు ధరలు పెంచుతూ జనాలను మోసం చేస్తున్నారు. దీంతో గతంలో రూ.120కి దొరికే క్వార్టర్ ఇప్పుడు రూ.230 అయిపోయింది. బార్‌లో రూ.60-రూ.80 చెల్లించుకోవాల్సిందే. బీరు దారి మరీ దారుణం. గతంలో రూ.100కి దొరికే బీరుకు ఇప్పుడు రూ.330 వదుల్చుకోవాల్సి వస్తోంది. దీంతో మద్యం పై ప్రభుత్వ సంపాదన అమాంతం హద్దులు దాటి పరుగులు పెడుతోంది.

పండుగ తాగుడే..

తూర్పుగోదావరి 78, కోనసీమ 49, అల్లూరి సీతారామరాజు జిల్లా 18 కలుపుకొని 145 ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా ఉమ్మడి జిల్లాకు ఆదాయం సమకూరుతోంది. వీటికి 26 బార్లు అదనం. ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా 13న లి క్కర్ 4283, బీర్లు 1099 కేసులు.. 14న 6339, 2650.. 15న 6186, 2676.. 16న 5828, 1783 కేసులు విక్రయించారు. వీటికి బార్‌లలో అమ్మకాలను కూడా కలిపితే దాదాపు 25వేల కేసుల(కార్టర్, హాఫ్, ఫుల్స్) లిక్కర్, 1 లక్షా 20వేల బీర్లను జనాలకు ప్రభుత్వం పట్టించేసింది. సాధారణంగా రోజుకు రూ.2 నుంచి రూ.3కోట్ల మద్యం విక్ర యాలు జరుగుతాయి. కానీ ఈ నాలుగు రోజుల్లో ప్రభుత్వ మద్యం దుకాణా ల్లో చూస్తే 13న రూ.3.87 కోట్లు, 14న రూ.6.21కోట్లు, 15న రూ.6.16 కోట్లు, 16న రూ.5.71కోట్ల అమ్మకాలు జరిగాయి. వీటికి బార్లలో విక్రయాలు కలుపుకొంటే మద్యం రూపేణా సుమారు రూ.25కోట్ల సొమ్మును సం క్రాంతి సందర్భంగా మందుబాబులు ప్రభుత్వానికి ముట్టజెప్పారు. ఇక సారా అమ్మకాలనూ పరిగణనలోకి తీసుకుంటే మరో రూ.2కోట్లు మద్యంప్రి యులు గుటుక్కుమనిపించారని తెలుస్తోంది.

నర్సరీని సందర్శించిన హైకోర్టు సీజే


హైకోర్టు సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు మొక్కను అందజేస్తున్న మల్లు పోలరాజు

కడియం, జనవరి 17: కడియపు లంక మల్లు పోలరాజుకు చెందిన శివాంజనేయ నర్సరీని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆయనకు పోలరాజు మొక్కను అందజేశారు. సీజె నర్సరీలో వివిధ రకాల మొక్కలను తిలకించారు. బోన్సాయ్ మొక్కల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంత చక్కని పచ్చని ప్రపంచాన్ని తిలకించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

అయోధ్య రాములోరికి కల్యాణ కొబ్బరి బొండాలు


రాములోరి ఆలయ ప్రతిష్ఠకు మండపేట నుంచి తీసుకెళ్లిన బొండాలు

మండపేట, జనవరి 17: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన కేవీ రామారెడ్డి దంపతులు తయారు చేసిన అయోధ్య రాములోరి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి తీసుకెళ్లారు. మండపేటకు చెందిన రామారెడ్డి దంపతులు తెలంగాణా రాష్ట్రంలోని భద్రాచలం రాములవారి కల్యాణానికి ప్రతియేటా కల్యాణ కొబ్బరి బొండాలను తయారు చేసి స్వామివారికి అందజేస్తారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మకంగా ఈనెల 22న అయోధ్యలో జరిగే శ్రీరాములవారి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి రామారెడ్డి దంపతులు మూడు కల్యాణ బొండాలను తయారు చేసి అయోధ్యలో ఉన్న శ్రీరామ మందిర ట్రస్టు నిర్వాహకులకు బుధవారం అందించామని రామారెడ్డి తెలిపారు.

లింక్ మోసం

- రూ.10 లక్షలు పోగొట్టుకున్న ఇంజనీరింగ్ విద్యార్థి

రాజమహేంద్రవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): లింక్ మోసం వలలో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి పడ్డాడు. తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం రూరల్‌లో బొమ్మూరు మురళీకొండకు చెందిన బి.నాగ ఆదిత్య కిరణ్ బీటెక్ చదివి ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గత ఏడాది డిసెంబరు 23న అతడి సెల్‌ఫోన్‌కి ఓ ఇన్‌స్టాగ్రామ్ మెస్సేజ్ వచ్చింది. రూ.2500 చెల్లించి ఆ లింక్‌లో ఉన్న టాస్క్ పూర్తిచేస్తే రెట్టింపు డబ్బు తిరిగి ఇచ్చేస్తామని సారాంశం. ఆ లింక్ క్లిక్ చేసి టాస్క్ సులభంగా ఉండ డంతో పూర్తిచేయగా కిరణ్ ఖాతాలో డబ్బు జమ అయ్యింది. దీంతో మరికొంత సొమ్మును అలానే చేశాడు. ఈ క్రమంలో దఫదఫాలుగా రూ.10.30లక్షలు చెల్లించాడు. కానీ, రెట్టింపు నగదు రాలేదు. అయితే, మరో రూ.10లక్షలు జమచేస్తే రెట్టింపు నగదు మొత్తం వస్తుందని మెస్సేజ్ వచ్చింది. తాను ముందు చెల్లించిన నగదుకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో కిరణ్ బొమ్మూరు పోలీసులను ఆశ్రయించాడు.

దుర్గేష్‌కు టీడీపీ నేతల పరామర్శ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 17: జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్‌ను పలువురు టీడీపీ నాయకులు పరామర్శించారు. ఇటీవల దుర్గేష్ భార్య ఉషారాణి మరణించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో బుధవారం రాజమహేంద్రవరంలోని దుర్గేష్ నివాసానికి వెళ్లి ఉషారాణి చిత్రపటానికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పా రావు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, కోనేరు వివేక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా బుధవారం సాయంత్రం ఎంపీ రఘురామకృష్ణంరాజు.. కందుల దుర్గేష్ నివాసానికి వచ్చి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అక్కడి నుంచి మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్ పయనమయ్యారు.



మాజీ ఎమ్మెల్సీ దుర్గేష్‌ను పరామర్శిస్తున్న ఎంపీ రఘురామకృష్ణంరాజు, టీడీపీ నాయకులు యనమల రామకృష్ణుడు, గన్ని కృష్ణ, ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి శ్రీనివాస్

నాడు కళకళ.. నేడు వెలవెల!!

- సచివాలయాల ఏర్పాటుతో మీ సేవ కేంద్రాల్లో నిలిచిన సేవలు

● రౌతులపూడి మండలం పైడిపాలకు చెందిన రైతు మ్యుటేషన్ కోసం గ్రామ సచివాలయానికి వెళ్లాడు. ఫోన్ నెంబరు అనుసంధానం కాలేదని పంపేశారు. వేలిముద్ర లేదా ఓటీపీ ద్వారానైనా చేయడానికి వెసులుబాటు ఉన్నా ఆధార్ లింకు చేసుకోవాలని తెలిపారు.

● శంఖవరం మండలం మండపం గ్రామానికి చెందిన వృద్ధురాలి మరణ ధ్రువపత్రం కోసం కుటుంబసభ్యులు దరఖాస్తు చేశారు. వీటి మంజూరు ఆలస్యం కావడంతో మళ్లీ మీసేవ కేంద్రాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది. దీంతో రెండుచోట్లా డబ్బులు చెల్లించాల్సి వచ్చింది.

శంఖవరం, జనవరి 17: పౌరసేవలన్నింటినీ సులభతరం చేయాలని, అవినీతి, అక్రమాలను అరికట్టి పనులు వేగవంతం చేయడానికి గత ప్రభుత్వాలు మీసేవా కేంద్రాలను ప్రారంభించాయి. అప్పటినుంచి ఆయా పరిధిలోని ప్రజలు నిర్ధిత రుసుం చెల్లించి తమకు కావాల్సిన సేవలను పొందేవారు. గ్రామ సచివాయాల సేవలు మొదలైనప్పటినుంచి అన్ని సేవలను వీటికి బదిలీ చేయడంతో మీసేవా కేంద్రాల్లో సేవలు నిలిచిపోయి నిర్వాహకులు పూర్తిగా ఉపాధి కోల్పోయారు. అప్పులు చేసి లక్షలు ఖర్చుచేసి కొనుగోలు చేసిన పరికరాలు వృథాగా ఉండిపోయాయని వారు వాపోతున్నారు. కొన్ని సేవలకు లబ్ధిదారులు మీసేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్నా అధికారులు మీసేవా ద్వారా వచ్చిన పనులు చేయకపోవడంతో ఈ కేంద్రాలు నిర్వీర్యమయ్యే స్థితిలో ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1974 మీసేవా కేంద్రాలుండేవి. వీటిలో అత్యంత ప్రధానమైన మ్యూటేషన్లు, ఆధార్, రేషన్‌కార్డుల్లో చేర్పులు, సరవణలు, కొత్తవాటికి దరఖాస్తు చేసుకోవడం, అడంగల్ దిద్దుబాట్లు, ఓటరు నమోదు గుర్తింపుకార్డులు జారీ వంటి 300 రకాల సేవలు అందేవి. వీటిల్లో ప్రధాన సేవలను సచివాలయాలకు అందజేయడంతో సగానికి పైగా మూతపడ్డాయి. మరికొంతమంది వీటిని మూసివెయ్యలేక, మరొక పని చెయ్యలేక ఇబ్బందులు పడుతున్నారు. నెలకు నిర్ధేశిత సంఖ్యలో సేవలు చెయ్యని మీసేవా కేంద్రాలను రద్దు చేస్తున్నారు.

30 కేంద్రాలు మూసివేత

కాకినాడ జిల్లాలో 45 మీసేవా కేంద్రాల్లో ఆధార్ సేవలు అందించేవారు. ప్రస్తుతం 15 కేంద్రాల్లో మాత్రమే ఈ సేవలు కొనసాగిస్తున్నారు. దీంతో మిగతా 30 కేంద్రాలను నిబంధనల పేరుతో మూసివేశారు. సచివాలయాలు వచ్చిన తర్వాత మండలానికి కొన్ని సచివాలయాలు ఎంపిక చేసి అక్కడే ఆధార్ సేవలు పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆటంకం లేకుండా..

మీసేవా కేంద్రాల ద్వారా సేవలు పొందేటప్పుడు వినియోగదారులకు ఆటంకం లేకుండా ప్రజలకు వీలైనప్పుడు ఏ సమయంలో వెళ్లినా సేవలు పొందే అవకాశం ఉండేది. విద్యుత్ సరఫరా లేకపోయినా, ఇంటర్‌నెట్ సరఫరాలో ఏలోపం ఉన్నా మీసేవా నిర్వాహకులే ప్రత్యామ్నాయ మార్గాల్లో సేవలు అందించేవారు. కేంద్రాల్లో అందించే సేవలను బట్టి వారికి కమీషన్ వచ్చేది. దీంతో నిరంతరాయంగా పనులు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేవారు. ప్రస్తుత సచివాలయాల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. సమస్య పరిష్కారానికి లబ్ధిదారులు రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. చాలావరకూ సచివాలయ భవనాలు అందుబాటులో లేకపోవడంతో సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదని పలువురు చెప్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం : మీ సేవ నిర్వాహకుడు

మీ సేవా కేంద్రం మీద ఆశలు పెట్టుకుని కంప్యూటర్లు, ప్రింటర్లు వంటి పరికరాలను కొనుగోలు చేశాం. ఇప్పుడు నెలకి రూ.వెయ్యి కమీషను రావడం గగనంగా ఉంది. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడుతున్నాయి. కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది. దీనిద్వారా వచ్చే ఆదాయంతో బతకలేం. వేరే పని చెయ్యలేం. ప్రభుత్వం మీసేవా కేంద్రాలకు పునర్ వైభవం తీసుకురావాలి.

జీఎన్‌ఎం ప్రాక్టికల్స్ ప్రారంభం

జీజీహెచ్(కాకినాడ), జనవరి 17: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ(జీఎన్ఎం) విద్యార్థులకు కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలోని ప్రభుత్వ నర్సింగ్ స్కూల్లో ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ బుధవారం ప్రారంభమయ్యాయి. కాకినాడ జిల్లావ్యాప్తంగా ఉన్న 31 నర్సింగ్ స్కూళ్లకు సంబంధించిన 3,500 మంది ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఫిబ్రవరి 1వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ పరీక్షలకు చీఫ్ ఎగ్జామినర్‌గా సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ పుష్కరావ్‌ను నియమించగా, చీఫ్ ఇన్విజలేటర్‌గా ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆషాదేవిని నియమించారు. ఐదుగురు ప్రభుత్వ, 11 మంది ప్రైవేట్ నర్సింగ్ స్కూళ్ల సిబ్బంది ఇన్విజలేటర్లుగా వ్యవహరిస్తున్నారు.

20 నుంచి రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు

కాకినాడ అర్బన్, జనవరి 17: ఈనెల 20, 21వ తేదీల్లో రాష్ట్రస్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీలు పిఠాపురం రాజీవ్‌గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్టు ఒలింపిక్ సంఘ కార్యదర్శి డాక్టర్ జి.ఎలీషాబాబు తెలిపారు. రాష్ట్రస్థాయిలో 150మంది క్రీడాకారులు హాజరవుతారని, జిల్లా స్థాయి ఎంపికలు పిఠాపురంలో గురువారం నిర్వహిస్తారని అన్నారు. 20ఏళ్లపైన వయస్సుగల అర్హులు పోటీల్లో పాల్గొనవచ్చుని, వివరాలకు 9490645859 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా

షర్మిళారెడ్డి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న షర్మిళారెడ్డి


రాజమహేంద్రవరం సిటీ, జనవరి 17: ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా షర్మిళారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత రాజమహేంద్రవరం హైటెక్ బస్టాండ్ సెంటర్‌లోని మేడపాటి సీతారామిరెడ్డి విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అక్కడి నుంచి భారీగా వాహనాలతో విజయవాడ తరలివెళ్లి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె రుడా చైర్‌పర్సన్‌గా పనిచేశారు. రాష్ట్ర మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, జోగి రమేష్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, పెద్దాపురం నేత దవులూరి దొరబాబు తదితరులు అభినందనలు తెలిపారు. ఆమె వెంట భర్త అనిల్ రెడ్డి ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతి

కాకినాడ జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. పిఠాపురం రూరల్ మండలం చిత్రాడ మంచినీటి చెరువువద్ద సెల్ఫీతీసుకుంటూ ప్రమాదవశాత్తూ చెరువులోపడి యువకుడు మృతి చెందాడు. అలాగే పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. కోటనందూరు మండలం కాకరపల్లి శివారు నల్లచెరువు మలుపువద్ద ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందాడు. ప్రత్తిపాడు ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి దుర్మరణం చెందాడు. అలాగే సామర్లకోట మున్సిపాల్టీలో అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడు పెద్దాపురం రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కరప మండలం వేములవాడకు చెందిన ఓ వ్యక్తి పాముకాటుకుగురై జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

చెరువులో పడి వలంటీర్ మృతి

- సెల్ఫీ తీసుకుంటూ జారిపడ్డ యువకులు


మృతుడు వలంటీరు సందీప్

పిఠాపురం రూరల్, జనవరి 17: సెల్ఫీ తీసుకునే సమయంలో చెరువుగట్టుపై నుంచి పడి ఇద్దరు యువకులు గల్లంతు కాగా ఒకరు మరణించగా మరొకరు సురక్షితంగా బయటపడ్డారు. సామర్లకోట మండలం చంద్రంపాలెం గ్రామానికి చెందిన నలుగురు యువకులు పిఠాపురం మండలం చిత్రాడలో క్రికెట్ ఆడేందుకు మంగళవారం వచ్చారు. సాయంత్రం సమయంలో గ్రామ శివారులోని సమ్మర్ స్టోరేజీ వాటర్ ట్యాంకు(మంచినీటి చెరువు) గట్టుపై సరదాగా నడుస్తూ సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఈ సమయంలో ఇద్దరు యువకులు గట్టుపై నుంచి ప్రమా దవశాత్తూ చెరువులోకి జారిపడ్డారు. ఇందులో చంద్రపాలెం సచివాలయంలో వలంటీర్‌గా పని చేస్తున్న గుడాల సందీప్ గల్లంతు కాగా మరొక యువకుడు సురక్షితంగా బయటపడ్డాడు. వెంటనే యువకులంతా కలిసి సందీప్ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు స మాచారం అందించారు. అప్పటికే రాత్రి కావడంతో మృతదేహాన్ని వెలికితీయడం సాధ్యం కాలేదు. బుధవారం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సందీప్‌కు తల్లిదండ్రులు, సోదరి ఉన్నారు. ఆడుకోవడానికి వెళ్లి సందీప్ మృత్యువాత పడటంతో అతని కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పిఠాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


పిఠాపురం రైల్వేస్టేషన్‌కు సమీపంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

పిఠాపురం: పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. విజయవాడ నుంచి విశాఖ వెళ్లే మార్గంలో మొదటి రైల్వే ప్లాట్‌ఫారానికి 100 అడుగుల దూరంలో ఇతని మృతదేహాన్ని రైల్వేపోలీసులు గుర్తించారు. రైలు నుంచి జారిపడటం లేదా ఢీకొని మరణించి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఇతని వయస్సు 35-40 వయస్సు ఉంటుందని, లేత నీలం రంగు ఫుల్‌హాండ్స్ షర్ట్, నీలం రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు. కుడి చేతిపై కన్నమ్మ పేరుతో పచ్చబొట్టు ఉందని చెప్పారు. ఇతని ఎత్తు సుమారు 5.6 అడుగులు ఉంటుందని, చామనచాయ రంగులో ఉన్నట్లు తెలిపారు. ఇతని వివరాలు తెలిసిన వారు సామర్లకోట రైల్వేపోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ బి.లోవరాజు కోరారు. ఇతని మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి


కోటనందూరు: కాకినాడజిల్లా కోటనందూరు మండలం కాకరపల్లి శివారు నల్లచెరువు మలుపు వద్ద ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకరపల్లి నుంచి అల్లిపూడి వైపు వెళ్తున్న సమయంలో మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. నాతవరం మండలం గుమ్మిడికొండ గ్రామానికి చెందిన కోడూరి ఆచారి(39) తలకు బలమైన గాయం కావడంతో తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ మృతి చెందాడు. ఎంబీ పట్నంకు చెందిన నాకిరెడ్డి సత్యవతి, నాకిరెడ్డి చిట్టెమ్మలకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శంకరరావు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని తాపీమేస్త్రి మృతి



ప్రత్తిపాడు, జనవరి17: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఫారెస్ట్ చెక్‌పోస్టుసెంటర్ జాతీయ రహదారిపై తాపీ మేస్త్రి మృతి చెందాడు. మండలంలో శరభవరానికి చెందిన ఉలిసి శ్రీను(40)మోటర్‌బైక్‌పై ప్రత్తిపాడు నుంచి శరభవరం వెళుతుండగా ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద రహదారిని క్రాస్ చేస్తుండగా రాజమండ్రి నుంచి ఇచ్ఛాపురం వెళుతున్న హైవేలో ఢీ కొంది. ఈ ప్రమాదంతో తాపీ మేస్త్రీ ని ఢీకొంది. ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. తాపీ పనులు ముగించుకుని వస్తున్నశ్రీను రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటం పట్ల అతని కుటుంబం సంఘటానాస్థలానికి వచ్చి కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేశారు.

వాహనం ఢీకొని పారిశుధ్య కార్మికుడి మృతి



సామర్లకోట: కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపాల్టీలో అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న మిర్యాల రాజు(35) అనే కార్మికుడిని పెద్దాపురం రోడ్డులో మోర్ మార్కెట్ ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి చేరగా ఆసుపత్రికి తరలించగా మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసు కుంది. రోజూలాగే మున్సిపల్ విధులకు మస్టర్ పనికి వెళుతు ండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. సహచర పారిశుధ్య కార్మికులు అతడిని సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నప్పటికీ రాజు మృతి చెందాడు. సామర్లకోట మండలం భీమవరపుపేటకు చెందిన రాజుకు భార్య, కుమార్తు, కుమార్తె ఉన్నారు. రాజు మృతితో కుటుంబజీవనాధారం కోల్పోయిన రాజు కుటుంబసభ్యుల రోదనలతో భీమవరపుపేటలో విషాధచాయలు అలుముకున్నాయి. సామర్లకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నా రు.

పాము కాటుతో వ్యవసాయ కూలీ మృతి


వాసంశెట్టి సూరిబాబు మృతదేహం

కాకినాడ క్రైం, జనవరి 17: పాము కాటుకు గురైన ఓ వ్యవసాయ కూలీ కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కొద్దిసేపటికే మృతి చెందాడు. కరప మండలం వేములవాడకు చెందిన వాసంశెట్టి సూరిబాబు(37) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున తన ఇంటి సమీపంలోని దూళ్ల మకాం వద్దకు వెళ్లాడు. అక్కడ చీకటిలో సూరిబాబును గుర్తు తెలియని విష సర్పం కాటేసింది. ఆ బాధతో మూలుగుతూ ఇంటికి వచ్చి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో కుటుంబీకులు అతడిని వెంటనే చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యం పొందుతున్న కొద్దిసేపటికే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సూరిబాబు మృతి చెందాడు. మృతుడికి భార్య కృష్ణవేణి, కుమార్తెలు తొమ్మిదేళ్ల రేణుక, ఏడేళ్ల సౌమ్య ఉన్నారు. కుటుంబానికి ఆధారమైన భర్త అకాలంగా మృత్యువాత పడడంతో భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమార్తెలు కన్నీరుమున్నీరుగా విలపించారు.

భార్యను వేధించిన కేసులో

భర్తకు ఏడాది జైలు

కాకినాడ క్రైం, జనవరి 17: భార్యను వేధించిన కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి తీర్పునిచ్చారు. కాకినాడకు చెందిన సురభి శ్రీరామం కుమార్తె సురభి విజయలక్ష్మిని హైదరాబాద్‌కు చెందిన పోతుకుచ్చి హనుమ శ్రీనివాస్‌కు ఇచ్చి 2011లో కాకినాడలో వివాహం చేశారు. హైదరాబాద్‌లో భర్తతో కాపురం చేస్తున్న సమయంలో అదనపు కట్నం కోసం విజయలక్ష్మిని భర్త మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. అదనపు కట్నం తెస్తేనే తిరిగి కాపురానికి తీసు కెళ్తానని చెప్పి పుట్టింట్లో వదిలేశాడు. దీంతో 2012లో విజయలక్ష్మి కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ (ప్రస్తుతం రామచంద్రపురం సీఐ) వి.దుర్గారావు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సాక్ష్యాలను పరిశీలించిన తర్వాత భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్త హనుమ శ్రీనివాస్‌కు ఏడాది జైలు శిక్షతోపాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ బుధవారం కాకినాడ రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి తీర్పు నిచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ గోసాల కమలాకుమారి వాదనలు వినిపించారు.

ట్రావెల్ బస్సు దగ్ధం


దగ్ధమైన బస్సు

ప్రత్తిపాడు, జనవరి 17: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం జోడి గంటల వంతెన సమీపంలో ట్రావెల్ బస్సు దగ్ధమైంది. రాజమండ్రి నుంచి విశాఖపట్నం వెళు తున్న ట్రావెల్ బస్సుకు మంటలు వ్యాపించి దగ్ధమైంది. ప్రమాదంలో ఎవరూ గాయపడకపోవడంతో సురక్షితంగా వెళ్లిపోయారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమై ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు.

ఘనంగా ముక్కనుమ పండుగ

కొత్తపల్లి, జనవరి 17: సంక్రాంతి పర్వదినాల్లో చివరిపండుగ ముక్కనుమ పండుగను మండల ప్రజలు బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. అత్తారింటింటి వచ్చిన అల్లుళ్లకు పందెం కోడి మాంసం, వివిధ రకాల చేపల కూరలతో విందు భోజనాలు వడ్డించారు. లోగిళ్ల వాకిట్లో వేసే రథం ముగ్గును బోగి మంటల వరకు లాగుతున్నట్టు ముగ్గులు వేసి సంక్రాంతి పండుగకు బుధవారంతో వీడ్కోలు పలికారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట



భోగాపురంలో నాటికల పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

భోగాపురంలో జాతీయస్థాయి నాటికల పోటీలు

పిఠాపురం రూరల్, జనవరి 17: సమాజం జరుగుతున్న పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపుతూ ప్రదర్శించిన నాటికలు అందరిని ఆలోచింపజేశాయి. భోగాపురం కళా పరిషత్ ఆధ్వర్యంలో పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో ప్రారంభమైన జాతీయస్థాయి ద్వితీయ నాటికల పోటీల తొలిరోజు ప్రదర్శించిన నాటికలు సందేశాత్మకంగా సాగాయి. విశాఖ ఉక్కు నగరం చైతన్య కళాస్రవంతి కళాకారులు ప్రదర్శించిన (అ)సత్యం నాటిక, విశాఖ భద్రం ఫౌండేషన్ కళాకారులు ప్రదర్శించిన మట్టిపరిమళం నాటిక అందరిని ఆకట్టుకుంది. నాటకరంగ ప్రయోక్త దర్శకుడు, రచయిత స్వర్గీయ మలిరెడ్డి బాబి స్మారక ప్రతిభా పురస్కారాన్ని సభినాల బ్రహ్మానందంకు అందజేశారు.

అంతకు ముందు జాతీయస్థాయి నాటికల పోటీలను ఉస్మానియా యూనివర్సిటీ థియేటర్ ఆఫ్ ఆర్ట్స్ విశ్రాంత ఆచార్యుడు జీఎస్ ప్రసాదరెడ్డి, ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు ఖాజావలీ, సినీ రచయిత జలదంకి సుధాకర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించగా, ప్రముఖ రంగస్థల నటులు ముమ్మిడి తాతకొండ, సునయన జయశ్రీ, భోగాపురం కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సత్యహరిశ్చంద్ర నాటకం

ప్రత్తిపాడు, జనవరి 17: మండలంలోని ధర్మవరంలో గౌరీశంకర్ల 87వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవార రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు నిర్వహించిన సత్యహరిశ్చంద్ర నాటకం ఆకట్టుకుంది. మొదటి సత్యహరిశ్చంద్రగా తెనాలికి చెందిన ఉప్పరాజేశ్వరరావు, రెండో సత్యహరిశ్చంద్రగా డీవీ సుబ్బారావు పోటాపోటీగా పద్యధారణ, హావభావాలతో అలరించారు. చంద్రమతిగా రాజాంకు చెందిన కిలారి లక్ష్మి చక్క టి గాత్రధారణతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అడవి సీను, స్మశాన ఘట్టాల్లో చంద్రమతి అభినయాలు ప్రేక్షకులను కన్నీటి పర్యాంతం చేశాయి. ఈ నాటకానికి ముందు నడకుదురు అనంతలక్ష్మి అనే బాలిక అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం చేశారు. కళాకారులకు, దాతలకు నిర్వాహక కమిటీ సభ్యులు జ్ఞాపికలు అందజేశారు.



సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన

ముగిసిన శివపంచాయత యాగం



పూర్ణాహుతిలో పాల్గొన్న వర్మ, మాజీ మంత్రులు యనమల, రాజప్ప

పిఠాపురం, జనవరి 17: టీడీపీ అధినేత నారా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో 5 రోజుల పాటు నిర్వహించిన శ్రీ శివపంచాయత యాగం బుధవారంతో ముగిసింది. పూర్ణాహుతి కార్యక్రమంలో వర్మ, లక్ష్మీదేవి దంపతులు, గిరీష్‌వర్మ దంపతులతో పాటు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి దంపతులు, వనమాడి కొండబాబు పాల్గొన్నారు. చంద్రబాబు గోత్రనామాలతో పూజలు జరిగాయి. నియోజకవర్గ ప్రజలకు అష్టైశ్వరాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, రైతులంతా సుభిక్షంగా ఉండాలని శివపంచాయతన యాగంలో భగవంతుడిని కోరుకున్నట్టు వర్మ తెలిపారు. ఉమామహేశ్వరుడు, గణపతి, సూర్యనారాయణమూర్తి, విష్ణుమూర్తికి పూజ లు జరిపారు. పూర్ణాహుతి కార్యక్రమాల్లో పిఠాపురం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

సామర్లకోట, జనవరి 17: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతిని గురువారం మండలంలోని వేట్లపాలెం టీడీపీ కార్యాలయం ఆవరణలో పెద్దఎత్తున నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన అనంతరం రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో, సామర్లకోటలో టీడీపీ నేతల ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహిస్తామన్నారు.

జగ్గంపేట: నియోజకవర్గంలో ప్రతీ గ్రామంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు నవీన్ ఆదేశించారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల ధర్నా

ప్రత్తిపాడు, జనవరి 17: ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని కోర్టు విధులు బహిష్కరించి న్యాయవాదులు ఆందోళన చేశారు. కోర్టు వద్ద నుంచి అల్లూరి సీతారామరాజు సెంటర్ వరకు ధర్నా చేశారు. ఈ చట్టం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, న్యాయ వ్యవస్థ పరిధి అధికారాలను దూరం చేస్తుందన్నారు. ఆందోళనలో బార్ అధ్యక్షుడు పుల్లయ్య కార్యదర్శి మధుబాబు, నాయకులు చలంకూరి రామకృష్ణం, లింగంపల్లి శివకుమార్, వెంకట్రావు, సుగుణ, పిల్లి బలరాముడు, పలివెల నాగేంద్రబాబు, రెడ్నం వెంకటరెడ్డి, బి.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సందర్శకులతో పార్కుల కిటకిట

కాకినాడ సిటీ, జనవరి 17: విద్యార్థులకు సంక్రాంతి సెలవులు కావడంతో నగరంలోని పార్కులు బుధవారం సందర్శకులతో కిటకిటలాడాయి. ప్రధాన పార్కులైన రాజా ట్యాంక్ పార్కు, గాంధీనగర్ పార్కు, జన్మభూమి పార్కుల తోపాటు పలు పార్కులు సందర్శకులతో కళకళలాడాయి. కొత్త సినిమాల థియేటర్ల వద్ద ప్రేక్షకుల తాకిడితో ట్రాఫిక్ నిలిచిపోతోంది. నగరంలో ఎగ్జిబిషన్ వద్ద ఇదే పరిస్థితి. 3 రోజులుగా మెయిన్‌రోడ్‌లో జగన్నాథపురం వంతెన వరకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది.



కాకినాడలో రాజా ట్యాంక్ పార్కు వద్ద సందర్శకులు

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

తిరుమల	:	సైంధవ్
లక్ష్మి	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ1	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	నా సామిరంగ
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	హనుమాన్

'కొత్త చట్టం రద్దు చేయాలి'

గండేపల్లి, జనవరి 17: లారీ డ్రైవర్స్, క్లీనర్లపై కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని రద్దు చేయాలని బుధవారం నీలాద్రిపేటలో జయహో రథసారధి లారీ డ్రైవర్స్, క్లీనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డ్రైవర్ ఎక్కడైనా రోడ్డు ప్రమాదానికి గురైతే జరిమానా, జైలు శిక్ష వంటి చట్టాలు తీసుకురావడం సరికాదన్నారు. ఏ డ్రైవర్ అయినా సురక్షితంగా వెళ్లాలని, వారికి కుటుంబ సభ్యులు ఉంటారన్నారు. లారీ డ్రైవర్స్, క్లీనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులకు అంగన్‌వాడీల సమాధానం

కొనసాగిన ఆందోళనలు

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



సామర్లకోటలో షోకాజ్ నోటీసులకు సమాధాన ప్రతులను అధికారులకు ఇస్తున్న అంగన్‌వాడీలు



ప్రత్తిపాడులో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

పెద్దాపురం, జనవరి 17: ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు అంగన్‌వాడీలు సమాధానాలు ఇచ్చేందుకు బుధవారం ప్రదర్శనగా వెళ్లారు. ఈ నోటీసులను రిజిస్టర్ పోస్టు, గోడలకు అతికించడం ద్వారా నిరసన తెలియచేశారు. అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారానికి 37వ రోజుకు చేరుకుంది. పెద్దాపురంలో సమ్మెను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా నాయకుడు దువ్వా శేషబాబ్జీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దారపురెడ్డి క్రాంతికుమార్, నాగమణి, అమల, ఎస్తేరురాణీ, సీఐటీయూ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



తాళ్లరేవులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సామర్లకోట: సామర్లకోట మండలం, పట్టణ పరిధిలో గల సుమారు 100 అంగన్‌వాడీ సిబ్బంది తమ యూనియన్ నాయకుల నేతృత్వంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణికి బుధవారం షోకాజ్ నోటీసుకు జవాబులేఖలు అందించారు. తమ వేతనాలు పెంపుదల చేయాలని అడుగుతున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే తాము సమ్మెకు దిగాల్సివచ్చిందన్నారు. ఇందుకు తమ తప్పుగా ప్రభుత్వం పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్మా చట్టాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని, ప్రభుత్వం జారీచేసిన సంజాయిషీ నోటీసును ఉపసంహరించుకోవాలని, తాము చేస్తున్న సమ్మె విరమించేందుకు సహకరించాలని ఐసీడీఎస్ అధికారులకు అంగన్‌వాడీలు స్పష్టంచేశారు.

తాళ్లరేవు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తాళ్లరేవు మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఆ సంఘం అధ్యక్షురాలు ఆదిలక్ష్మి మాట్లాడుతూ 36 రోజులుగా సమస్యల పరిష్కారం కోసం మహిళలు సమ్మె చేస్తుంటే వైసీపీ ప్రభుత్వానికి పట్టకపోవడం చాలా దారుణమన్నారు. అందరి సమస్యలను పరిష్కరించి అంగన్‌వాడీలను మాత్రమే గాలికి వదిలేసే ప్రయత్నం చేయడం దురదృష్ట పరిణామమన్నారు. అనంతరం మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలికి సమస్యలు పరిష్కరించాలని వినతి అందించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో అంగన్‌వాడీలు నిరసన ప్రదర్శన నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. శిబిరాన్ని జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ, వి.చంద్రవతిలు సందర్శించి అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సమస్యలపై ఏకరువు

పెద్దాపురం మండల పరిషత్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యవతి

పెద్దాపురం, జనవరి 17: మండలంలో ఉన్న పలు సమస్యలపై ఎంపీటీసీ, సర్పంచ్‌లు ఏకరువు పెట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ మిరియాల లోవకాజు మాట్లాడుతూ మర్లావ గ్రామంలో నాటుసారా ఏరులై పారుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, ముడుపులు తీసుకుని విడిలేస్తున్నారన్నారు. నాటు సారా కారణంగా ఎంతోమంది అనారోగ్యంపాలు కావడంతో పాటు, గ్రామంలో గొడవలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయంలో ఎస్ఈబీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆయన మండిపడ్డారు. కాండ్రకోట ఎంపీటీసీ జాగు వీరభద్రరావు మాట్లాడుతూ కాకినాడ నుంచి తామరాడ బస్సును పునరుద్ధరించకపోవడంపై మండిపడ్డారు. పలు సమస్యలపై ఎంపీటీసీలు ప్రశ్నించారు. జడ్పీటీసీ గవరసాన సూరిబాబు, ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్,ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

20న రా కదలిరా సభ

కాజులూరు టీడీపీ పరిశీలకుడు శ్రీనివాస్‌బాబా



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌బాబా

కాజులూరు, జనవరి 17: కోనసీమ జిల్లా మండపేటలో ఈనెల 20న నిర్వహించనున్న రా కదలిరా బహిరంగ సభను విజయవంతం చేయాలని కాజులూరు మండల టీడీపీ పరిశీలకుడు పెంకే శ్రీనివాస్‌బాబా పిలుపునిచ్చారు. ఈ మేరకు కాజులూరులో మండలాధ్యక్షుడు పేపకాయల బాబ్జీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండపేటలో నిర్వహించే భారీ బహిరంగ సభకు 20న మధ్యాహ్నం కాజులూరు మండల గ్రామాల నుంచి టీడీపీ కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు రాయుడు లీలాశంకర్, వనుం వీరబ్రహ్మం, పెదిరెడ్డి శ్రీనివాస్, ఎస్సీసెల్ నాయకుడు పోతుల మాధవ, మైనార్టీసెల్ నాయకుడు షేక్ మీరా, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పెంకే అప్పన్న, మాజీ సర్పంచ్ మాతా స్వామి, పోతురాజు కొండబాబు, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు పలివెల ఇజ్రాయిల్‌రాజు, మండల చేనేత సంఘం అధ్యక్షుడు బొడ్డు వీరకృష్ణ పాల్గొన్నారు.

ప్రతిపాదనలు రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

కొత్తపల్లి, జనవరి 17: కొత్త సంవత్సరంలో పంచాయతీలకు మంజూరయ్యే నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు రూపొందించాలని కొత్తపల్లి ఎంపీడీవో పి వెంకట నారాయణ సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులకు జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనులను దశల వారీగా చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని, తద్వారా గ్రామస్తుల అవసరం మేరకు ప్రాధాన్యత ప్రకారంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు చేపడతామని ఎంపీడీవో తెలియజేశారు. ఎంఈవోలు బుర్రావేణుగోపాల్, పైడిరాజు, ఈవోపీఆర్డీ ఎంఎస్ భాస్కర్, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జ్యోతుల నెహ్రూ పరామర్శ

జగ్గంపేట, జనవరి 17: కాట్రావులపల్లికి చెందిన కారిచర్ల సత్తిబాబు ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకోవడంతో ఆయన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నార. అదే గ్రామానికి చెందిన వార్డు సభ్యులు డమరసింగు మధు సోదరుడు ఇటీవల మరణించడంతో ఆ కుటుంబాన్ని, అదే గ్రామానికి చెందిన వలిరెడ్డి వీరబ్బాయి, అదే గ్రామానికి చెందినగనిశెట్టి శేషారావు ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. మునిరెడ్డి నాగేశ్వరరావు, కంటే రామారావు, సుంకవిల్లి రాజు, వేన్న వీరబాబు,బిక్కినబాబి, రాయుడు శివ ఉన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించడమే లక్ష్యం

తాళ్లరేవులో జనసేన, టీడీపీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పితాని

తాళ్లరేవు, జనవరి 17: రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి రాజధాని అడ్రస్ లేకుండా చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించడమే జనసేన, టీడీపీ పార్టీల ఉమ్మడి లక్ష్యమని ముమ్మిడివరం జనసేన కోఆర్డీనేటర్ పితాని బాలకృష్ణ అన్నారు. బుధవారం తాళ్లరేవు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జి టేకుమూడి లక్ష్మణరావు అధ్యక్షతన జనసేన, టీడీపీ ఉమ్మడి సమావేశం జరిగింది. 20న మండపేటలో జరిగే రా... కదలిరా తెలుగుదేశం పిలుస్తోంది కార్యక్రమానికి జనసమీకరణలు చేసి అత్యధికంగా తరలించాలని ఉమ్మడి నేతలు చర్చించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ వైసీపీ అహంకార ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని జనసైనికులు, టీడీపీ నేతలు సమన్వయంతో పనిచేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడే ప్రయత్నాలు చేయాలన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గ పరిశీలకుడు, మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, తాళ్లరేవు ఇన్‌చార్జి గదుల సాయి పర్యవేక్షించారు. కార్యక్రమంలో జనసైనికులు అత్తిలి బాబూరావు, గండి అనిల్, పుణ్యమంతుల సత్తిబాబు, వీరమహిళ ముత్యాల జయలక్ష్మి, టీడీపీ మహిళలు పొన్నమండ రామలక్ష్మి, పెమ్మాడి కృష్ణవేణి, వెంటపల్లి ఉమామహేశ్వరి, మోపూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ



పోటీల్లో విజేతలతో జ్యోతుల నెహ్రూ

గండేపల్లి, జనవరి 17: క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో తోడ్పడతాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని ఎన్టీరాజపురం గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా 3రోజులుగా జడ్పీటీపీ పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు పరిమి బాబు ఆధ్వర్యంలో పరిమి వీర్రాజు అన్నపూర్ణ మెమోరియల్ జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 30కి పైగా జట్లు పాల్గొన్నాయి. మంగళవారం రాత్రి పోటీల్లో కానవరం, నరేంద్రపురం జట్లు తలపడగా కానవరం మొదటిస్థానంలో నిలిచింది. రెండో స్థానంలో నరేంద్రపురం, మూడోస్థానంలో ఎన్టీరాజపురం, నాల్గోస్థానంలో సోమవరం జట్లు నిలిచాయి. ముఖ్య అతిథిగా నెహ్రూ హాజరై విజేతలకు ట్రోఫీ, రూ.25వేలు నగదు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ.10వేలు, నాల్గో బహుమతి రూ.5వేలు క్రీడాకారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, నిరుత్సాహ పడకుండా ఇప్పుడు ఓడినవారు గెలుపు కోసం కృషి చేయాలన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, కందుల చిట్టిబాబు, జాస్తి వసంత్, మారిశెట్టి భద్రం, సుంకవిల్లి రమేష్ పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి


కరప ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు




శిక్షణలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ

కరప, జనవరి 17: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024-25 రూపకల్పనపై అందరూ అవగాహన కల్పించుకుని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని మండల ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఫ్రంట్‌లైన్ వర్కర్స్ గ్రామ పంచాయతీ ఫంక్షనల్ కమిటీ సభ్యులకు ఏర్పాటు చేసిన 2రోజుల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 17 రకాల సుస్థిరాభివృద్ధి సూచికలను సాధించేందుకు నిర్దేశించిన 9 థీమ్స్‌లో గ్రామ పంచాయతీకి అవసరమైన ఒక థీమ్‌ను ఎంపిక చేసుకుని అంశాలు పూర్తి చేసేందుకు సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి 25శాతం కేటాయించి మిగిలిన నిధులను ఇతర అంశాలకు వినియోగించాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు శానిటేషన్, తాగునీటి కోసం కేటాయించి ఆన్‌లైన్ విధానంలో ప్రణాళికను అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఏవో గుత్తుల భీమశంకర్‌రావు, వి.సునీల్‌కుమార్ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ఎలా రూపకల్పన చేయాలో వివరించి వీడియో ద్వారా శిక్షణ ఇచ్చారు.

పలుచోట్ల పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



పెద్దాపురంలో కలిసిన పూర్వ విద్యార్థులు



గండేపల్లి: మల్లేపల్లిలో కలిసిన విద్యార్థులు

పెద్దాపురం, జనవరి 17: స్థానిక లూథరన్ హైస్కూల్లో 1995-96 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం జరిగింది. ఎక్కడెక్కడి నుంచో విద్యార్థులు అంతా ఒకచోట చేరి సందడిచేశారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకుని చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. విందు భోజనాలు చేశారు. కార్యక్రమంలో బద్ది వీరవెంకట సత్యకుమార్, శివకోటి లోవరాజు, బద్ది శ్రీదేవి, ఆకుల దశరథరామయ్య, ఆనంద్, నాగేశ్వరరావు, వెంకట్రావు, నాగేంద్ర తదితరుల పాల్గొన్నారు.

శంఖవరం: శంఖవరం జిల్లా పరిషత్ పాఠశాల 1996-2001 చెందిన పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సంక్రాంతికి వచ్చారు. పాత విషయాలన్నీ సంతోషంగా చర్చించుకున్నారు. వారికి పాఠాలు నేర్పిన గురువులు సింహాద్రి వరహాలు మూర్తి, రాముడు, రాజు, గౌరి, సత్తిరాజు, కొండరావు, సుబ్రహ్మణ్యంను సన్మానించారు. ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కొండమూరి శివకిరణ్, రాయినాగు, ఈత వీర వెంకట రమణ, బైరా సాయి రమే ష్, పడాల సురేష్, దూరిపూడి నాగబాబును అభినందించారు.

గండేపల్లి: మండలంలో మల్లేపల్లి గ్రామ శివారులో ఫంక్షన్‌హాల్లో 2002-2003సంవత్సరంలో మల్లేపల్లి జడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు కలిసి సందడి చేశారు. అలనాటి జ్ఞాపకాలను తలుచుకుని గడిపారు. తమ గురువులు వెంకటరెడ్డి, గణేష్, సాయి లక్ష్మి, మోహిని, గిరిధర్, రాంబాబు, రాజశేఖర్ రెడ్డి, రాంప్రసాద్, నాగరాజు, అప్పన్నలను సత్కరించారు.



శంఖవరంలో పూర్వ విద్యార్థులు

'వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం'



శృంగరాయనిపాలెంలో మాట్లాడుతున్న సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీటీసీలు

కిర్లంపూడి, జనవరి 17: వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం అవుతున్నాయని అందుకే ఆ పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు చేశామని శృంగరాయనిపాలెం గ్రామ సర్పంచ్ పట్టు చంటిబాబు, ఎంపీటీసీ గరగ రాంబాబు, ఉప సర్పంచ్ బొజ్జపు శ్రీను తెలిపారు. బుధవారం శృంగరాయనిపాలెం పంచాయతీ ఆవరణలో వారంతా మూకుమ్మడి రాజీనామా చేశారు. వైసీపీ బూత్‌కమిటీ సభ్యులు, సేవాదళ్ సభ్యులతో పాటు సుమారు 100 మంది వరకు ఆ పార్టీకి రాజీనామా చేశారు. వారు మాట్లాడుతూ త్వరలో టీ డీపీ, జనసేన పార్టీలో సాగుతామన్నారు. రాష్ట్ర టీడీపీ ఉపా. ధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, శృంగరాయని పాలెం టీడీపీ నాయకుల ఆహ్వానం మేరకు ఆ పార్టీలోకి వెళ్లామని తెలిపారు. త్వరలోనే వారి సారథ్యంలో భారీ ఎత్తున టీడీపీలో చేరుతామని ప్రకటించారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన

కరప, జనవరి 17: ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలు ఎలా పని చేస్తాయో ఓటర్లందరూ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహశీల్దార్ కె.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. అరట్లకట్ట గ్రామంలో బుధవారం ఓటర్లతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జి.శ్యామ్ ప్రసాద్, టీఆర్ఎస్ ప్రసాద్‌తో కలిసి ఓటర్లకు ఈవీఎంలు ఎలా పని చేస్తాయో ఎలా ఓటు వేయాలో, కౌంటింగ్ తదితర విషయాలను వివరించి ఓటర్లకు అవగాహన కల్పించారు.

పారా అథ్లెటిక్స్‌లో నవీన్‌కు పతకాలు

కోటనందూరు, జనవరి 17: గోవాలో జాతీయస్థాయిలో నిర్వహించిన పారా అథ్లెటిక్స్‌లో కోటనందూరు మండలం కొత్తకొట్టాం గ్రామానికి చెందిన సుర్ల నవీన్ సత్తా చాటాడు. 400 మీటర్లు పరుగులో స్వర్ణ పతకం, 1500 మీటర్లు పరుగు (టీ12)లో వెండి పతకాలు సాధించాడు. దీంతో నవీన్ తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

త్రిమూర్తుల స్వామి ఉత్సవం

తుని రూరల్, జనవరి 17: గవరయ్య కోనేరు వద్ద కొలువై ఉన్న త్రిమూర్తుల స్వామివారి ఉత్సవం వైభవంగా జరిగింది. స్వామిని దర్శించుకుంటే పాడి పంటలు సమృద్ధిగా ఉండి సస్యశ్యామలం అవుతుందని ఈ ప్రాంత వాసుల నమ్మకం. దీంతో ఏటా పెద్ద ఎత్తున రైతు కుటుంబాలు, భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుంటారు. బుధవారం పెద్దఎత్తున భక్తులు రాగా ఆలయ కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా గౌరిదేవి జాతర

కోటనందూరు, జనవరి 17: కేఈచిన్నాయిపాలెంలో గౌరిదేవి జాతర మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నెలపాటు ఉత్సవాలు నిర్వహించి అఖరి రోజు గౌరిదేవిని అమ్మవారింటి నుంచి అత్తవారింటికి సాగనంపారు. తారా జువ్వలు, తప్పిడిగుళ్ల నడుమ ఊరేగింపు జరిగింది.

నేడు వికసిత్ భారత్ సంకల్పయాత్ర

జగ్గంపేట, జనవరి 17: జగ్గంపేట గ్రామ సచివాలయం వద్ద గురువారం ఉదయం 9గంటలకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరుగుతుందని బీజేపీ నాయకులు కందుల వెంకట అచ్యుతరామారావు తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధు లు, యూనియన్ నాయకులు హాజరుకావాలని కోరారు.

సెబ్ దాడుల్లో నలుగురి అరెస్ట్

ప్రత్తిపాడు, జనవరి 17: ప్రత్తిపాడు సెబ్ అధికారులు ప్రత్తిపాడు,కిర్లంపూడిలో దాడులు చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. ఒమ్మంగి గ్రామంలో 20లీటర్ల సారాట మొగిలి సత్యవతిని ఆమెకు సారా సరఫరా చేసిన సత్తెనపల్లి శ్రీనులను అరెస్ట్ చేశారు. ధర్మవరంలో అక్రమంగా 15 మద్యం బాటిళ్లను అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పంపనబోయిన తాతాజీని అరెస్ట్ చేశారు. తామరాడలో 20లీటర్ల సారాతో రాంబాబును అరెస్ట్ చేశారు. 400లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు.

వరి కుప్ప దగ్ధం

రౌతులపూడి, జనవరి 17: మండలంలోని శృంగవరం గ్రామానికి చెందిన ఈగల బాబ్జీ వరి కుప్ప దగ్ధమైంది. పల్లపు చామవరం పొలంలో ఇటీవలే వరి నూర్పులు నూర్చి కుప్ప వేశాడు. ఇప్పుడు రెండున్నర ఎకరాలకు చెందిన గండి దగ్ధం కావడంతో ఈగల బాబ్జీ బోరున విలపిస్తున్నాడు.

GENERAL PUBLICATION

Under instructions from our client M/s. SHRIRAM FINANCE LIMITED, Registered Office at Chennai and Branch Office at II Floor, Super Bazar Complex, Main Road, KAKINADA. We issue this notice to the General Public.

Our client is intending to advance loan to Sri DWARAMPUDI CHANDRASEKHAR REDDY, S/o. Bhaskar Reddy who agreed to create equitable mortgage relating to the under mentioned schedule property belongs to them.

The public is hereby informed that if anybody has got any objection in respect of the mortgage of the schedule property, kindly contact under mentioned address within one week. Otherwise, the same is treated as no objection.

SCHEDULE

ITEM NO. 1: East Godavari District, Kakinada Sub-Registry, Kakinada Mandal Kakinada Zilla Parishad Area, Kakinada Village, Agricultural Land in S.No. 4/1 full extent of Ac. 1-28 Cents with all usufruct water, ways and all easementary rights.

ITEM NO. 2: East Godavari District, Kakinada Sub-Registry, Kakinada Mandal Kakinada Zilla Parishad Area, Kakinada Village, Medaline Village, Agricultural Land in S.No. 97/3 full extent of Ac. 2-26 Cents, in S.No. 97/4 full extent of Ac. 0-03 Cents, a total extent of Ac. 2-29 Cents land including canal consisting of single plot with all usufruct water, ways and all easementary rights. East: Land gifted by the executants to his daughter Gudimetla Rukhmini Devi; West: Item No. 3; South: Land gifted to Gudimetla Rukhmini Devi; North: Land of Pasupuleti Manikyam.

ITEM NO. 3: East Godavari District, Kakinada Sub-Registry, Kakinada Mandal Kakinada Zilla Parishad Area, Kakinada Village, Medaline Village, Agricultural Land in S.No. 97/1 an extent of Ac. 1-63 Cents out of full extent of Ac. 3-26 Cents land including canal consisting of single plot with all usufruct water, ways and all easementary rights. East: Item No. 2; West: Land of Penderi China Veerraghavulu; South: Land of gifted to Gudimetla Rukhmini Devi; North: Land in S.No. 97/2, 4/1, 2.

G.S.M.N. SWAMY, B.Com, B.L., G.A.S.S. JYOTHI, B.L.
Kakinada. Advocates, 69-24-6, BF-1, Gandhi Nagar,
Dt: 17-01-2024 KAKINADA 4. Cell: 9866191397